క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ అయోధ్యనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి. రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేదారేశ్వర పేట ఒకటో లైన్ నుంచి 7వ లైన్ వరకు, లోటస్ సెక్టార్ వన్ నుంచి సెక్టార్ ఫైవ్ వరకు, రామలింగేశ్వరపేట జీరో లైన్ నుంచి ఏడో లైన్ వరకు , శాంతి నగర్, అయోధ్య నగర్ , బసవతారక నగర్, బుడమేరు కట్ట, సూరిబాబు కాలనీ, డొంక రోడ్డు, రామకృష్ణాపురం తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

షుగర్, బీపీ పరీక్షలు చేయించుకోవాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): హెచ్ఐవీతో జీవిస్తూ ఏఆర్టీ మందులు వాడే వారు షుగర్, బీపీ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జేడీ డాక్టర్ మంజుల అన్నారు. విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రి ఏఆర్టీ సెంటర్‌లో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, ఎన్‌సీడీ విభాగాల ఆధ్వర్యంలో హెచ్ఐవి బాధితులకు షుగర్, బీ పీ ఉచిత పరీక్షలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మంజుల మాట్లాడుతూ బీపీ , షుగర్‌లను గుర్తించి మందులు వాడటం ద్వారా వాటిని అదుపులో ఉంచుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ శాక్స్ డెప్యూ డీడీ డాక్టర్ చక్రవర్తి, ప్రభుత్వాస్పత్రి డిప్యూటీ సివిల్‌సర్జన్ ఆర్ఎంఒ డాక్టర్ శ్రీనివాసరాజు , జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అధికారి డాక్టర్ జె ఉషారాణి, ఏ ఆర్ టీ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గౌతం అంబేడ్కర్, డాక్టర్ శ్రీదేవి, సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భక్తిసంగీతం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన అన్నమయ్య సంకీర్తన గాన ప్రచార భక్తబృందం ఆలపించిన భక్తిగీతాలు భక్తులను రంజింపచేశాయి. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ధర్మపథం వేదికపై పప్పు సదాశివశాస్త్రి పలు కీర్తనలను, గీతాలను ఆలపించారు. సదాశివశాస్త్రికి వయోలిన్‌పై చావాలి శ్రీనివాస్, మృదంగంపై చావాలి కృష్ణమోహన్ చక్కటి సహకారం అందించారు. అమ్మవారిని దర్శించుకుని మహా మండపంకు చేరుకున్న భక్తులు ధర్మపథం వేదికపై జరుగుతున్న కార్యక్రమాన్ని ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు. అనంతరం ఆలయ అధికారులు సదాశివశాస్త్రి బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

17న విజయవాడలో మారథాన్



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండటంతో పాటు, నడకను అలవాటు చేయాలనే ఉద్దేశంతో ఈ నెల 17న విజయవాడ రన్నర్స్ సొసైటీ , శ్రీరామ్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో విజయవాడ మారథాన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మణిదీపక్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎంజీరోడ్డులోని ఓ హోటల్‌లో మారథాన్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మణిదీపక్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ 8 మారథాన్‌లు విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. తొమ్మిదో మారథాన్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా 5కే, 10కే, 21కే పరుగు ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు యువత ఆసక్తి చూపుతున్నట్లు తెలిపారు. శ్రీరామ్ ఫైనాన్స్ ప్రతినిధులు ఈడుపుగంటి నాగేంద్ర, ఫణీంద్రలు మాట్లాడుతూ విజయవాడ మారథాన్‌కు ఒక ప్రత్యేకత ఉందన్నారు. రిజిస్ట్రేషన్ కోసం విజయవాడ రన్నర్స్ డాట్‌కాం కానీ, 7815955123 నంబర్‌ను కానీ సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో విజయవాడ రన్నర్స్ సభ్యులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీనివాసునికి అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేంచేసియున్న శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారికి శుక్రవారం విశేష అలంకరణ చేసి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ అనంతరం స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

నేరస్తులపై పట్టు తప్పుతున్న 'సింగ్‌నగర్'

- పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల పైనే పెట్రోల్ పోసి దాడికి ప్రయత్నించిన నేరస్తులు
- ముఠాలుగా మారుతూ నేరాలకు పాల్పడుతున్న వైనం
- స్టేషన్‌లో అవినీతి రాజ్యమేలుతున్నా.. నిద్రలేవని 'నిఘా'



పాతనేరస్తులు అడ్డాగా మారుతున్న న్యూఆర్ఆర్‌పేట అపార్ట్‌మెంట్స్ ప్రాంతం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నేరస్తులపై పోలీసుల పట్టు తప్పుతోంది. ఈ స్టేషన్ ఆవరణలో పాత నేరస్తులు.. రౌడీలు, కేడీలు.. సస్పెక్ట్ షీటర్లు.. గంజాయి.. బ్లేడ్ బ్యాచ్ సభ్యుల కదలికలపై 'నిఘా' లోపించడంతో వీరి ఆగడాలకు హద్దు అదుపులేకుండా పోతుంది. సింగ్‌నగర్ స్టేషన్ లోనే ఏళ్ల తరబడి పాతుకుపోయిన కొంతమంది సిబ్బంది వీరికి బాగా అలవాటు పడడం.. మరి కొంతమంది పోలీసులు వీరి వద్ద కూడా చేతులు చాచి అవినీతికి అలవాటు పడడంతో పోలీసులంటే వీరికి భయం లేకుండా పోతుంది. దీంతో సామాన్య ప్రజలతో పాటు పోలీసులకు కూడా ఇక్కడ నేరస్తులంటే భయం ఏర్పడుతుంది.

పోలీసులపైనే దాడులు.. బెదిరింపులు.....

సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత నేరస్తులు నలుగురు ఏకంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీసులపైనే పెట్రోల్‌తో దాడులు.. చంపేస్తామని బెదిరింపులకు పాల్పడిన ఘటన ఇటీవల చోటుచేసుకుంది. న్యూరాజరాజేశ్వరీపేటకు చెందిన పాత నేరస్తులు నలుగురు పోలీస్ స్టేషన్ సమీపంలోని కొంతమందితో గొడవపడుతున్నారు. ఈ విషయం కంట్రోల్ రూమ్ నుంచి సింగ్‌నగర్ పోలీసులకు సమాచారం రావడంతో మహిళా కానిస్టేబుల్ భూక్యా దివ్య, హెడ్‌కానిస్టేబుల్ ఎంఎ అహ్మద్‌లు సంఘటనా స్థలానికి వెళ్లారు. ఇంతలో ఓ వ్యక్తి ఇదే గొడవపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు రాగా అతన్ని చూసిన దుర్గ, నయోమి, లక్ష్మీ అనే మహిళలతో పాటు మరికొంతమంది కలిసి స్టేషన్ ఆవరణలోనే అతనిపై రాళ్లతో దాడి చేసేందుకు ప్రయత్నించారు. దీన్ని గమనించిన పోలీసులు వారిని వారిస్తుండగానే ఇంతలో సంఘటనా స్థలానికి వెళ్లిన దివ్య, అహ్మద్‌లు నయోమి అనే మహిళ తండ్రిని స్టేషన్‌కు పట్టుకువస్తుండగా ఒక్కసారిగా వారు రెచ్చిపోయారు. పెట్రోల్ తీసుకురండని చెప్పగానే వెంటనే వారిలో ఒకరు వెళ్లి పెట్రోల్ బాటిల్ తీసుకురాగా వారు దివ్య, నాగరాజులపై పెట్రోల్ పోసి అగ్గిపెట్టె తీసుకొని నిప్పుపెట్టే ప్రయత్నం చేశారు. దీన్ని గమనించిన స్టేషన్‌లోని పోలీసులందరు వచ్చి వారిని అదుపుచేసేందుకు ప్రయత్నించగా వారిపై బూతు పురాణాలు వినిపించి, బ్లేడ్ బ్యాచ్‌తో మీ అంతు చూస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. దీనిపై కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురు మహిళలు, మరికొంతమంది వ్యక్తులపై సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే అదే మహిళలకు టీడీపీ, జనసేన పార్టీ నాయకులు వత్తాసు పలికి పోలీసులపై కూడా కేసులు నమోదు చేయాలని ప్రభుత్వ పెద్దల నుంచి ఒత్తిళ్లు తెచ్చి.. కేసు రాజీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.



అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్

మళ్లీ హడలెత్తిస్తున్న రౌడీ, సస్పెక్ట్ షీటర్లు...

స్టేషన్ పరిధిలో ఉన్న కొంతమంది రౌడీ, సస్పెక్ట్ షీటర్లు, పాతనేరస్తులపై పోలీసులు తూతూమంత్రంగా చర్యలు తీసుకోవడంతో వారు మళ్లీ ఈ ప్రాంత ప్రజలను హడలెత్తిస్తున్నారు. న్యూఆర్ఆర్‌పేటలో పేరుగాంచిన ఓ రౌడీషీటర్ కొడుకు, ఓ చెత్త కొట్టు నడుపుతున్న వ్యక్తి కొడుకుతో పాటు మరో నలుగురు పాతనేరస్తులు కొత్తగా గ్రూపులు కట్టి అల్లర్లకు పాల్పడుతున్నారు. ఇటీవల జరిగిన వినాయ చవితి పందిరి వద్ద ఈ గ్రూపుల్లో వారు రోడ్డుపై కొట్లాటకు దిగగా వారిలో ఓ వర్గంపై పోలీసులు కేసు నమోదు చేయగా మరో వర్గంపై కేసు పెడతామని వారి వద్ద డబ్బులు తీసుకొని కేసులు పెట్టకుండా వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నాలుగు గ్రూపులు ప్రస్తుతం బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లను పెంచి పోషిస్తున్నారు. కేజీఎఫ్ అపార్ట్‌మెంట్స్, రైల్వే ట్రాక్ ప్రాంతాలతో ప్రత్యేక బీట్లకు వెళ్తున్న పోలీసులను సైతం వీరు బెదిరిస్తున్నట్లు సమాచారం.

■ దారిని వెళ్లే వారిని, ఒంటరి వ్యక్తులను అడ్డుకొని రౌడీషీటర్లు, గంజాయి బ్యాచ్ వారిపై దాడులు చేసి డబ్బులు వసూళ్లు చేసిన ఘటనలు ఇక్కడ నిత్యకృత్యంగా మారుతున్నాయి. జెమిని అనే రౌడీషీటర్ ఎంకే బేగ్ స్కూల్ వద్ద ఇదే విధంగా ఇద్దరు వ్యక్తులపై దాడి చేయగా, మరో ఇద్దరు గంజాయి బ్యాచ్ దేవినగర్‌లో యూజీడీ కార్మికులను బెదిరించి డబ్బులు, ఫోన్లు లాక్కెళ్లారు. కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్ సమీపంలో పట్టపగలు ఓ మహిళ బుధవారం రోడ్డుపై తన కుమారుడితో నడిచి వెళ్తుండగా ముగ్గురు వ్యక్తులు బైకుపై వచ్చి చేతిలో ఫోను లాక్కొని పరారయ్యారు.

16న గురజాడ సాహితీ వైభవం

విజయవాడ కల్చరల్: రసభారతీ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 16న బందరు రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో నవయుగ కవితా వైతాళికుడు గురజాడ అప్పారావు సాహితీ వైభవం కార్యక్రమం నిర్వహిస్తునట్లు రసభారతి కార్యదర్శి డాక్టర్ జంధ్యాల పరదేశిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ గుమ్మా సాంబశివ రావు, డాక్టర్ కావూరి సత్యవతి, డాక్టర్ పింగళి వెంకట కృష్ణారావు సాహితీ ప్రసంగాలు చేస్తారని పేర్కొన్నారు. కవుల స్వీయ కవితా గానం అనంతరం కవి పండిత సత్కారం నిర్వహిస్తామన్నారు.

ఉపాలయాల్లో ఈవో తనిఖీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఉన్న అమ్మవారి సన్నిధిలోని పలు ఉపాలయాల్లో ఆలయ ఈవో కెఎస్.రామరావు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఘాట్‌రోడ్డులోని వీరాంజనేయ స్వామి దేవస్థానం, లక్ష్మీగణపతి ఆలయం, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం, నాగపుట్ట, నటరాజ స్వామి ఆలయం, మల్లేశ్వరస్వామి వారి ఆలయాలతోపాటు కొబ్బరి కాయలు కొట్టే ప్రదేశాన్ని ఈవో తనిఖీ చేశారు. ఘాట్‌రోడ్డులోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శర్మ సంగావరపు నాగేశ్వరరావు, లక్ష్మీగణపతి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న అనధికార అర్చకులు, సహాయకులుగా ఉన్న చెరువు నాని, సాంబశివ అనే వారిని గుర్తించారు. అనధికారికంగా ఎవరైనా అర్చకులను సహాయకులుగా నియమించుకున్నట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామని ఈవో హెచ్చరించారు.

రాకపోకలకు ఆటంకం

- పనులు పూర్తయినా తీయని పరంజాలు
- ఆర్‌యూబీలో రాకపోకలకు అవస్థలు



మధురానగర్ ఆర్‌యూబీలో ఏర్పాటు చేసిన పరంజా

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా వేలాది మంది రాకపోకలు సాగించే మధురానగర్ ఆర్‌యూబీలో బొమ్మలు వేయటానికి వేసిన పరంజాలు రాకపోకలకు ఇబ్బంది కరంగా మారాయి. మధురానగర్ ఆర్‌యూబీ గోడలకు అందంగా పెయింటింగ్‌లు వేసేందుకు పరంజాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ గోడలకు పెయింటింగ్ పనులు పూర్తయ్యి నెల రోజులు కావస్తుంది. కానీ పెయింటింగ్ పనుల కోసం ఏర్పాటు చేసిన పరంజామాను మాత్రం నేటికీ తొలగించలేదు. 12 అడుగులు రోడ్డును 2 ప్రక్కల పరంజాలతో 4 అడుగుల దారిని ఆక్రమించి 8 అడుగులు దారిగా కుదించి వేశారు...దీంతో వేగంగా వచ్చిన వాహన చోదకులు పరంజామా వల్ల ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వాహనాలను ఓవర్‌టేక్ చేయలేనిస్థితి ఏర్పడుతుంది. ముందు రికాబండి వెళుతుంటే వాటి వెనుకనే కార్లు, ఆటోలు తదితర వాహనాలు వెళ్ళాల్సి వస్తుంది. కావున అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మండపం నిర్మాణానికి రూ.లక్ష విరాళం



బాబా వారి చిత్రపటంతో దాతను సత్కరిస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రాషిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో నందా దీపం మండపం నిర్మాణంకు విజయలక్ష్మి కాఫీ అండ్ జనరల్ స్టోర్స్ అధినేత దాత బొగ్గరపు శ్రీనివాస రావు రూ.లక్ష విరాళంను మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతంరెడ్డి మాట్లాడుతూ దాతలు, భక్తుల సహకారంతో బాబా మందిరంను ఆంధ్రా షిర్డీగా తీర్చిదిద్దామన్నారు. షిర్డీలో మాదిరిగా అన్ని పూజలు, హారతులు సేవలు ఇక్కడ నిర్వహిస్తున్నామని చెప్పారు. షిర్డీ వెళ్ళి మొక్కులు తీర్చుకోలేనివారు సైతం ఇక్కడ మొక్కులు తీర్చుకుంటున్నారని పేర్కొన్నారు. అలాగే పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాత బొగ్గరపు శ్రీనివాస రావు మాట్లాడుతూ మందిరంలో నందా దీపం మండపంకు తన భార్య జ్యోతి జ్ఞాపకార్థం రూ. లక్ష విరాళం అంజేస్తున్నట్లు తెలిపారు. మందిర అభివృద్ధిలో తాను కూడా భాగస్వామి అయినందుకు సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి దాతకు బాబావారి శేష వస్త్రం, బాబావారి చిత్రపటంతో సత్కరించారు. కార్యక్రమంలో మందిర కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

దోమల లార్వా నివారణకు చర్యలు

డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని



పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): నివాస ప్రాంతాల్లో దోమల లార్వా నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె శుక్రవారం నగరంలో నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఇంటింటికీ వెళ్లి లార్వా నాశక చర్యలు ఎలా తీసుకోవాలో ప్రజలకు వివరించారు. పలు ఇళ్లలో లార్వాను గుర్తించి, వ్యాధి కారక దోమలు వృద్ధి చెందుతున్న వైనాన్ని ఆ ఇళ్లలో నివాసం ఉంటున్న వారికి తెలియచేశారు. ఇంటితో పాటు, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యాధులు సోకకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కలిగించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, వైద్యాధికారులు డాక్టర్ నిరుపమా, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామికి విశేష పూజలు



దీపాలంకరణ సేవలో ఆది దంపతులు



స్వామి వారిని దర్శించుకుంటున్న ఈవో రామరావు, ఆలయ అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారికి శుక్రవారం విశేష పూజలు, అభిషేకాలు, దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మల్లేశ్వరస్వామి వారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ జరిగాయి. సాయంత్రం స్వామి వారి ఆలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు లింగార్చనను ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. అనంతరం సహస్ర లింగార్చన అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ జరిగింది. ఆలయ ఈవో కెఎస్.రామరావు, ఆలయ వైదిక కమిటీ సభ్యులు, వేద పండితులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ నిర్వహించారు. శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవ మూర్తులకు పూజల అనంతరం దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు .

18న అమ్మవారికి లక్ష పసుపుకొమ్ములతో అలంకరణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేంచేసియున్న శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి 18వ తేదీన లక్ష పసుపు కొమ్ములతో అలంకరిస్తున్నట్లు ఆలయ అర్చకులు ప్రసాద్‌శర్మ తెలిపారు. ఈనెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు మూడు రోజులపాటు దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ళ హనుమంతరావు వివరించారు. 16వ తేదీ శనివారం అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు, అర్చన అనంతరం సారె సమర్పణ ఉంటుందన్నారు.

భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చీరలను సారెగా సమర్పించవచ్చునని పేర్కొన్నారు. సోమవారం అమ్మవారికి లక్ష పసుపు కొమ్ములతో అలంకరణ, ఆలయ ప్రాంగణంలో లక్ష్మీ గణపతి, చండీ, రుద్ర హోమాలు, నవగ్రహ వాస్తు హోమాలను నిర్వహిస్తారని వివరించారు. ఉత్సవాల అనంతరం అమ్మవారికి అలంకరించిన పసుపు కొమ్ములను భక్తులకు పంపిణీ చేస్తామని వారు తెలిపారు.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు



పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు ఎన్‌సీసీలో తర్ఫీదు పొందటం వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఎన్‌సీసీ కాడెట్ వింగ్స్ కాకినాడ గ్రూప్ కమాండర్ కర్నల్ రితిన్ మోహన్ అగర్వాల్ అన్నారు. పటమటలోని స్టెల్లా కళాశాలలో శుక్రవారం ఆయన అకడమిక్ ఇన్స్‌పెక్షన్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీతత్వంతోనే విద్యార్థులు నాయకులుగా మారతారని తెలిపారు. టీమ్ బిల్డింగ్, సమయ పాలన అలవర్చుకోవటంతో టీమ్ మేనేజ్‌మెంట్, కమ్యునికేషన్, సామాజిక అంశాలపై అవగాహన పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 4వ గరల్స్ బెటాలియన్ కమాండింగ్ అధికారి కర్నల్ బాలిందర్ సింగ్, 3వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి కర్నల్ మాలిక్, కళాశాల కరస్పాండెంట్ లీనా క్వాడ్రస్, కళాశాల సిస్టర్ జసింత క్వాడ్రస్, డాక్టర్ ఇన్నాసియా, డాక్టర్ లావణ్య, కెప్టెన్ శైలజ, ఎన్‌సీసీ సబ్ లెట్యూనెంట్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక మాసోత్సవాలు



ఉభయ రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో స్వామివారు



అంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ ఉభయ రామలింగేశ్వరస్వామివారి దేవాలయం, మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠం , పసుపుతోట శ్రీదత్తసాయి మందిరం శ్రీ చంద్రశేఖర స్వామివారి మందిరంలో కార్తీక మాసం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. స్వామి వారికి ప్రీతికరమైన మహన్యాసపూర్వక రుద్రాభిషేకం , అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీదత్త సాయి మందిరంలో స్వాములకు దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది.

కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలి



కళాకారుల సమావేశంలో పాల్గొన్న విజయలక్ష్మి

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని మహానటి సావిత్రి సాహిత్య, సాంస్కృతిక కళాపీఠం సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయ లక్ష్మి అన్నారు. సావిత్రి కళాపీఠం ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో కళాకారుల సమావేశం, సినీ నటుడు బాల కృష్ణకు సినీ సంగీత నీరాజనం నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన విజయ లక్ష్మి మాట్లాడుతూ కళాకారుల సాంస్కృతిక రాయబారులని తెలిపారు. పేద కళాకారులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తునట్లు తెలిపారు. వివిధ సాహిత్య సంస్థల ప్రతినిధులు దూపాటి శ్రీదేవి, ప్రభల శ్రీనివాస్, ఎమ్ఎస్ నారాయణ. చావా నరసింహారావు, కె.డేవిడ్ రాజు. డీవీ వీరభద్రరావు, ప్రసూనా రామన్ ప్రసంగించారు. మల్లాది స్వాతి, సుశీల్‌కుమార్, పి.శ్రీనివాసరావు, బెల్లంకొండ భారతి, విష్ణు ప్రియ తదితరులు పలు చిత్ర గీతాలను ఆలపించారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

ఘనంగా సమర్పణ అభిషేక కృతజ్ఞత ఆరాధన




సమర్పణ అభిషేకం చేస్తున్న రెవ.జోసఫ్, రెవ.కిరణ్‌కుమార్, రెవ.శామ్యూల్ శేఖర్ తదితరులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రస్తుత సమయంలో ఎక్కడ చూసినా యుద్ధ వాతావరణాలే కనిపిస్తున్నాయి. ప్రపంచ శాంతి కోసం ప్రతి సేవకుడు సమర్పణ కలిగిన ప్రార్థనలు చేయాలని తెలుగు బాప్టిస్ట్ చర్చీస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రెవ.మంగలపూడి జోసఫ్ అన్నారు. సమర్పణ అభిషేక కృతజ్ఞత ఆరాధన దుర్గం సత్యం వీధిలో శుక్రవారం ఘనంగా జరిగింది. దీనికి ముఖ్య ప్రసంగీకులుగా హాజరైన రెవ.జోసఫ్ మాట్లాడుతూ నేటి సమాజంలో హింస నానాటికీ పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా డబ్బు కోసం.. సరదాల కోసం.. లేనిపోని కోరికల కోసం మానవత్వం మంట గలిపేలా కొంతమంది ప్రవర్తిస్తున్నారని ఆవేదన చెందారు.

ప్రేమ, కరుణ, దయ అనే గుణాలను మరచి.. ఒకరినొకరు చంపుకునేలా పగలు, ప్రతీకారాలు పెంచుకుంటున్నారన్నారు. ఎక్కడ చూసినా నెమ్మది లేదని.. ప్రాంతాల మధ్య, కులాల మధ్య, దేశాల మధ్య రగులుతున్న ఈ యుద్ధ వాతావరణం నుంచి మానవ సమాజాన్ని కాపాడేందుకు ప్రతి సేవకుడు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం రెవ.కిరణ్‌కుమార్, రెవ. ముక్కేర శామ్యూల్ శేఖర్, రెవ.డి.ఇస్సాకు, రెవ.కోలా డానియేల్‌లతో కలిసి పాస్టర్ మన్నం మహేష్, పలు సంఘ కాపరులకు సమర్పణ అభిషేకం చేసి, సర్టిఫికెట్లు అందజేశారు.

గజలక్ష్మీదేవిగా భ్రమరాంబ అమ్మవారు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన పాతశివాలయంలో భ్రమరాంబ అమ్మవారు గజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం(పాత శివాలయం)లో కార్తీక నక్త దీక్ష మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆలయంలో శుక్రవారం పలు విశేష వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.అమ్మవారికి ప్రత్యేక అలంకారం, అనంతరం త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామార్చన చేశారు. శ్రీ మల్లేశ్వరస్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన, ఆలయ ప్రదక్షిణలు, పంచహారతులు అనంతరం చతుర్వేద స్వస్తి తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు.